క్లుప్తంగా

ఓటర్ అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేటలో సోమవారం ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం, వీవీ ప్యాట్‌ల పనితీరును ప్రదర్శించారు. ఓటు వేసిన తర్వాత సరిగా పడిందా, లేదా అని వీవీ ప్యాట్ ద్వారా చూసుకోవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర్, ఉపసర్పంచ్ దేవరాజు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలని ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

ఇల్లంతకుంట: తెలంగాణ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేర్చాలంటూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట దళిత బహుజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులకు మూడెకరాల భూమి, దళిత బంధు, డబుల్ బెడ్రూం ఇళ్లు, తదితర పథకాలను ప్రభుత్వం ఎక్కడా కూడా పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. మండలంలో రోడ్లకు మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, నర్సయ్య, రాకేష్, ఎల్లయ్య, నరేశ్, రాములు, శంకర్, పర్శరాం, నర్సయ్య, నాగరాజు, ప్రవీణ్, రాయమల్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో చక్కని విద్య



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ఎంపీపీ

బోయినపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట పాటలతో కూడిన చక్కని విద్య అందుతుందని ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని రామన్నపేట గ్రామంలో సోమవారం నూతన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచు కన్నం మధు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, నాయకులు చింతలపల్లి వెంకటరెడ్డి, కవ్వంపల్లి రాములు, కొంకటి మధు, ఎండీ. సలీమ్, బాబు పాల్గొన్నారు.

రైతుల చూపు.. ఆరుతడివైపు..

- చౌడు భూముల్లో అధునాతన సేద్యం
- మారిన అన్నదాతల తలరాతలు
- నూతన ఒరవడి సృష్టిస్తున్న రైతులు
- డిమాండ్ ఉన్న పంటలపై దృష్టి
- 20 గుంటలు.. నెల రూ.40 వేల ఆదాయం



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు వంగల నర్సింహరెడ్డి. గ్రామం ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి. తనకున్న 30 ఎకరాల భూమిలో ఆర్గానిక్ పద్ధతిలో తన భార్య లక్ష్మి తోడుగా చిరుధాన్యాలతో పాటు మొక్కజొన్న, వరి సాగు చేస్తున్నాడు. తీరొక్క పంట సాగుతో సుమారు రూ.12 లక్షల దాకా ఆదాయం సమకూరుతోంది. వీటిలో రూ.4 లక్షలు ఖర్చులు పోగా రూ.8 లక్షలు మిగులుతున్నాయి. డ్రై సీడింగ్ యంత్రాన్ని వాడి టైం, డబ్బును ఆదా చేసుకుంటున్నాడు. ఒక వరుస క్రమంలో డ్రై సీడింగ్ జరిపితే మందులు, ఎరువులు వేసేందుకు సులవుతుందని అంటున్నారు. పంటలను కూడా సాగు చేస్తున్న.



రాజన్నపేటలో పందిరిపై పంటల సాగు

ఎల్లారెడ్డిపేట: వినూత్న ఆలోచన విధానం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వం ప్రోత్సాహం వెరసి గ్రామాల్లో అన్నదాతలు ప్రత్యామ్నాయ పంటలవైపు అడుగులు వేస్తూ తమ తలరాతలను తామే మార్చుకుంటున్నారు. అంతగా సాగుకు యోగ్యం కాని చౌడు భూముల్లో సిరులు పండిస్తున్నారు. ఏటా తీరొక్క పంట వేస్తూ, ఆధునాతన పద్ధతులు పాటిస్తూ అద్భుతాలు సృష్టిస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 25 మంది రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేస్తూ, సేద్యం తీరును మార్చి అధిక దిగుబడులు సాధిస్తుండగా వారిని కలెక్టర్, ప్రజాప్రతినిధులు గుర్తించి ఇటీవల వారికి ప్రసంశా పత్రాలతో సత్కరించారు. నూతన సాగు పద్ధతులను అవలంభిస్తూ ముందుకు పోతున్న ఈ రైతులు మిగతా రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన 25 మంది రైతులు వివిధ రూపాల్లో పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటకు చెందిన రైతు సుంకూరి శంకర్ పందిరి సాగు చేపట్టి 20 గుంటల భూమిలో కూరగాయాలు సాగు చేసి నెలకు రూ.40 వేల ఆదాయాన్ని పొందుతున్నాడు. రాచర్ల గొల్లపల్లికి చెందిన మహమ్మద్ ఇబ్రహీం అనే రైతు నాలుగెకరాల భూమిలో వినూత్న రీతిలో వ్యవసాయం చేస్తూ, కూలీల కొరతను అధిగమించేందుకు డ్రమ్ సీడర్, వెదజల్లు ప్రక్రియ ద్వారా వరి పంటను పండించడమే కాకుండా వాన కాలంలో విత్తనోత్పత్తి ద్వారా సుమారు 2 లక్షల పైచిలుకు ఆదనపు ఆదాయాన్ని సంపాదించాడు. ఇలా ప్రత్యామ్నాయ పంటలతో మండల వ్యాప్తంగా అభ్యుదయ రైతులుగా గుర్తింపు పొందారు.

ఆరుతడితో అధిక దిగుబడి

జిల్లాలో వ్యవసాయరంగంలో అన్నదాతలు కొత్త పుంతలు తొక్కుతూ ముందుకుపోతున్నారు. ఆరుతడి పంటలతో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. కొంతమంది రైతులు అంతర్, పందిరి పంటలుగా శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగుతున్నారు. పందిరిపై బీర, కాకర, సొరకాయ, అలిచింత, చిక్కుడు, అంతర్ పంటగా టమాట, బెండకాయ, గోరుచిక్కుడు, కొత్తిమీర, ఉల్లి పంటలను సాగు చేస్తున్నారు. సిరిసిల్లకు చెందిన రైతు రంగారెడ్డి పూల పంటలు, గొల్లపల్లిలో నర్సింహరెడ్డి చిరుధాన్యాలు, మరికొంత మంది రైతులు డ్రమ్‌సీడ్, విత్తనాలు వెదజల్లే పద్ధతిలో తక్కువ భూమిలో పంటలను సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు.

డిమాండ్ పంటలవైపే మొగ్గు..

మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలపైనే రైతులు మొగ్గు చూపుతున్నారు. నూతన సాగు (ఇన్నోవేటివ్)పద్ధతులు పాటిస్తూ పంటలు పండిస్తున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు సంకూరి శంకర్. రాజన్నపేట గ్రామానికి చెందిన ఆయన బతుకుదెరువు కోసం 19 ఏళ్ల గల్ఫ్ బాట పట్టి, 2013లో ఇంటికి తిరిగి వచ్చాడు. తనకున్న ఎకరం భూమిలోనే ఎవుసం చేయాలని అనుకున్నాడు. మొదటగా వరి సాగు చేయగా బోరులో సరిగా నీరులేక ఇబ్బందులు పడ్డాడు. దీంతో కొత్తగా కూరగాయాలు పండించాలని నిశ్చయించుకున్నాడు. పందిరి సాగు కోసం 2016లో భార్య రజిత పేరు మీద మహిళ సంఘం ద్వారా రూ.లక్ష రుణంతో 20 గుంటల భూమిలో పందిరి వేసి, డ్రిప్ ఏర్పాటు చేశాడు. కేవలం రూ.5 వేలతో కూరగాయాల సాగుతో నెలకు రూ.40 వేలు సంపాదిస్తున్నట్లు తెలిపాడు.

సేద్యం తీరును మార్చుకొని నూతన ఒరవడిని సృష్టిస్తున్న అభ్యుదయ రైతులను కలెక్టర్ స్థాయి అధికారులు గుర్తించి వారిని ప్రోత్సహించే విధంగా ప్రసంశ పత్రాలను అందించి అభినందించారు. వీరిని మిగతా జిల్లా రైతులు స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. ఇకపై మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలనే సాగు చేసే విధంగా మిగతా వారికి పల్లెల్లో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

అటు ఉపాధ్యాయుడిగా.. ఇటు రైతుగా



గంభీరావుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూ, ఇటు ఆధునిక సేద్యంవైపు అడుగులు వేస్తున్న. విధి నిర్వహణతో పాటు సెలవు సమయంలో వ్యవసాయం చేస్తున్న. రిసెర్చ్ వంగడాల విత్తనాలను ఉత్పత్తి చేసిన డ్రమ్ సీడర్, వెదజల్లు ప్రక్రియను యూట్యూబ్ ద్వారా నేర్చుకొని మిగతా రైతులకు అవగాహన కల్పిస్తున్న.

– మహమ్మద్ ఇబ్రహీం, యువ రైతు, రాచర్ల గొల్లపల్లి

విభిన్న పద్ధతుల్లో వ్యవసాయం



ప్రత్యామ్నాయ సాగు పద్ధతులను అవలంభిస్తూ, రైతులు ముందుకుపోతున్నారు. కొత్త విధానాలు నేర్చుకోవడానికి ఎప్పటికప్పుడు అధికారులను సంప్రదిస్తున్నారు. పంటల మార్పిడి నూతన యంత్రాల వాడకం, ఆర్గానిక్ ఫామింగ్ వంటి పద్ధతుల్లో వ్యవసాయం చేస్తూ, చిరుధాన్యాలు, ఆరుతడి పంటలు పండిస్తున్నారు. మారుతున్న పరిస్థితులు అనుగుణంగా రైతులు ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేస్తూ ముందుకు పోవడం సంతోషకరం.

– చాద భూంరెడ్డి, వ్యవసాయాధికారి, ఎల్లారెడ్డిపేట

నాగమ్మ.. సల్లంగా సూడమ్మా

నాగుల పంచమి సందర్భంగా సోమవారం మహిళలు నాగదేవతకు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాలోని పలు దేవాలయాల వద్ద పుట్టకు పూజలు చేసి, నైవేద్యం సమర్పించి, పుట్టలో పాలుపోసి ఇంటిల్లిపాది ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. ఆలయాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. మహిళా ప్రజాప్రతినిధులు నాగదేవతకు పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు.

– వేములవాడ/వేములవాడరూరల్/వేములవాడఅర్బన్/ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్/తంగళ్లపల్లి/రుద్రంగి/కోనరావుపేట/గంభీరావుపేట



వేములవాడ: పుట్టలో పాలుపోసి మొక్కుకుంటున్న మహిళలు



గంభీరావుపేట: నాగదేవతకు పాలు పోసి పూజలు చేస్తున్న మహిళలు



తంగళ్లపల్లిలో..



వేములవాడఅర్బన్: నాంపల్లి గుట్టపై..



ఎల్లారెడ్డిపేట: నారాయణపూర్‌లో..

విజ్ఞాన తెలంగాణ కావాలి

- అగ్రహారం డిగ్రీ కళాశాల ఎత్తేస్తే ఊరుకోం
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్



కలెక్టరేట్‌ను ముట్టడించిన ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

సిరిసిల్లటౌన్: విద్యార్థులు విజ్ఞాన తెలంగాణ కావాలని కోరుకుంటున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనికాంత్ అన్నారు. నాలుగు రోజులుగా జీపుజాతా నిర్వహించిన ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు సోమవారం కలెక్టరేట్‌ను 500 మంది విద్యార్థులతో కలిసి ముట్టడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని విస్మరించిందన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.5,177 కోట్ల స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని, విద్యారంగంలో ఖాళీగా ఉంటున్న పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, ఎంఈవో పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల అగ్రహారం డిగ్రీ కళాశాలను ఎత్తేసే సర్కారు ఆలోచన మానుకోవాలని లేనిపక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. అనంతరం విద్యారంగ సమస్యలపై కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మందా అనీల్, ప్రధాన కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, కుర్ర రాకేష్, జూలపెల్లి మనోజ్, వేణు, సాయి, ఆదిత్య, అభిషేక్, నవీన్, రాకేశ్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగిన దీక్షలు



దీక్ష శిబిరంలో మాజీ సర్పంచులు

సిరిసిల్లటౌన్: మాజీ సర్పంచులు పదమూడో రోజు నిరసన దీక్షలను చేపట్టారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం మీడియాతో వక్తలు మాట్లాడారు. ఇన్ని రోజులుగా తాము నిరవధికరిలే దీక్షలను చేపడుతుంటే ప్రభుత్వం పట్టింపులేకుండా ఉండటం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. మాజీ సర్పంచుల దీక్షలకు పలువురు రాజకీయ పార్టీల నేతలు సంఘీభావం తెలిపారు. దీక్షల్లో బొడ్డు దేవయ్య, సంపునూరి మల్లేశంగౌడ్, అలువాల లక్ష్మణ్, దేవుని నర్సయ్య, గోవర్దన్, సత్యనారాయణరెడ్డి, పైలూరి రాజమల్లు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలించిన డీపీవో



రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో రవీందర్

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లి గ్రామపంచాయతీ రికార్డులు సోమవారం జిల్లా పంచాయతీ అధికారి రవీందర్ రికార్డులు పరిశీలించారు. వర్షాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సర్పంచ్ గొర్రె కరుణ, ఎంపీడీవో నరేశ్‌కుమార్, గ్రామ కార్యదర్శి వెంకటేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కోనరావుపేట తహసీల్దార్‌గా విజయప్రకాశ్‌రావు



విజయప్రకాశ్‌రావు

కోనరావుపేట: మండల తహసీల్దార్‌గా విజయప్రకాశ్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 9న బాధ్యతలు తీసుకున్న ఉమాశంకర్‌ను 12 రోజులకే సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయ డీఏవోగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి తహసీల్దార్‌గా పనిచేస్తున్న విజయప్రకాశ్‌రావును ఇక్కడికి బదిలీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐలు రాజశేఖర్, రజిని, సిబ్బంది ఉమాశంకర్ వీడ్కోలు పలికి, నూతన తహసీల్దార్‌కు స్వాగతం పలికారు.

జిల్లాలో చిరుజల్లులు

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో సోమవారం చిరుజల్లులు వర్షం కురిసింది. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో తేలిక పాటి వర్షాలు పడ్డాయి. జిల్లాలోని వేములవాడలో అత్యధికంగా 21.6 మిల్లీ మీటర్ల వర్షం పడగా రుద్రంగిలో 13.7, చందుర్తిలో 4.0, వేములవాడ రూరల్‌లో 2.2, బోయినపల్లిలో 1.5, సిరిసిల్లలో 8.2, కోనరావుపేటలో 13.2, వీర్నపల్లిలో 17.9, గంభీరావుపేటలో 7.4, ముస్తాబాద్‌లో 0.8, తంగళ్లపల్లిలో 1.9, ఇల్లంతకుంటలో 10.1 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఎల్లారెడ్డిపేటలో పెద్దగా వర్షం పడలేదు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

సిరిసిల్లకల్చరల్: ప్రస్తుత విద్యాసంవత్సరంలో వివిధ కోర్సుల్లో చేరిన విద్యార్థులు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసే ప్రక్రియ ప్రారంభమైంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈబీసీ లకు చెందిన అర్హులైన విద్యార్థులు డిసెంబర్ 31లోపు దరఖాస్తు చేసుకోవచ్చునని ఎస్సీ డీవో వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్‌లో తమ వివరాలను పొందుపరచాలన్నారు. ఫ్రెష్ విద్యార్థులు దరఖాస్తుతో పాటు ఎస్సెస్సీ మెమో, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంక్ ఖాతా, అలాట్‌మెంట్ ఆర్డర్, గతేడాది వరకు చదివిన స్టడీ సర్టిఫికెట్లు జత పరచాలన్నారు. రెన్యువల్ విద్యార్థులు తల్లిదండ్రుల ఆదాయానికి సంబంధించి స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని జత చేయాలన్నారు.

23, 24న ఇంటర్వ్యూలు

సిరిసిల్లఅర్బన్: జిల్లాలోని పలు పాఠశాలలో తాత్కాలిక ప్రాతిపాదికన కంప్యూటర్ బోధించేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మెరిట్ లిస్ట్ ఆధారంగా ఈనెల 23, 24న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు డీఈవో రమేశ్‌కుమార్ ఒక ప్రటనలో తెలిపారు. మెరిట్ లిస్టు జాబితాను జిల్లా విద్యాధికారి కార్యాలయంలో అందుబాటులో ఉందని, మెరిట్ లిస్టు అభ్యర్థులు ఒర్జినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. మిగతా వివరాలకు 94416 72819 నెంబర్‌లో సంప్రదించాలన్నారు

బీఆర్ఎస్ సంబరాలు



ఎల్లారెడ్డిపేటలో..



గంభీరావుపేటలో..

ముస్తాబాద్/తంగళ్లపల్లి/ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి/కోనరావుపేట/రుద్రంగి/వేములవాడఅర్బన్: సిరిసిల్ల, వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులుగా కేటీఆర్, చల్మెడ లక్ష్మీనర్సింహారావులను ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ నాయకులు ఆయా మండల కేంద్రాల్లో సంబరాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. వేములవాడలో నందికమాన్ వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. అధిష్ఠానం నిర్ణయించిన అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌కు స్థల పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపల్లి గ్రామంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం ఎస్‌పీడీసీఎల్ కాంట్రాక్షన్ డీఈ చంద్రమౌళి, ఏడీఈ అంజయ్య, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి సోమవారం స్థల పరిశీలన చేశారు. సర్పంచ్ వాణి, ఏఈ రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లఅర్బన్: గల్ఫ్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని గల్ఫ్ తెలంగాణ ప్రవాస భారతీయుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్ర శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం గల్ఫ్ సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి, గల్ఫ్ నుంచి వచ్చిన వారికి రూ. 10 లక్షలను అందించాలన్నారు. లేనియెడల వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని హెచ్చరించారు.

చేనేత పరిశ్రమను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుంది

సిరిసిల్లఅర్బన్: రాష్ట్రంలో చేనేత పరిశ్రమను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ చేనేత కార్మికులకు అన్యాయం చేస్తుందని తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమటి పల్లి సదానందం అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి, చేనేత వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు.

దొరల ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం

బోయినపల్లి: దొరల ప్రభుత్వాన్ని గద్దె దించి బహుజన ప్రభుత్వం ఏర్పాటు చేయడం బీఎస్పీ లక్ష్యమని బీఎస్పీ చొప్పదండి అసెంబ్లీ ఇన్‌చార్జి కొంకటి శేఖర్ అన్నారు. మండలంలోని స్తంభంపల్లి గ్రామంలో

సంక్షిప్త వార్తలు

గుడ్ మార్నింగ్ చొప్పదండిలో భాగంగా సోమవారం ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. జిల్లా కమిటీ సభ్యుడు అక్కెనపెల్లి శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

రూరల్ సీఐకి సన్మానం

తంగళ్లపల్లి: సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్‌ను మండల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, ఏఎంసీ మాజీ చైర్మన్ సింగిరెడ్డి రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మైనార్టీ నాయకుడు ఎండీ.ఫరూక్ సన్మానించారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని ప్రేమ సమాజ గ్రంథాలయానికి సోమవారం మండల కేంద్రానికి చెందిన జక్కని దేవేందర్ పలు పుస్తకాలు వితరణ చేశారు.

క్షీరాభిషేకం

తంగళ్లపల్లి: రుణాలు మాఫీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని గండిలచ్చపేట గ్రామంలో సోమవారం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

నోట్‌బుక్స్ అందజేత

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సింగిల్ విండో డైరెక్టర్ గాడిచర్ల రామచంద్రం పెన్స్, నోట్ బుక్స్‌ను అందజేశారు.

చైర్‌పర్సన్ కలిసిన ఏఎంసీ డైరెక్టర్

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల ఏఎంసీ డైరెక్టర్‌గా నూతనంగా నియామకమైన పెద్దూరుకి చెందిన షేక్ ఆలీ మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సమాచారం

డిగ్రీలో ప్రవేశాలు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం ప్రథమ సంవత్సరంలో అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 4 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వీర ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏస్సీ(ఎంపీసీ), బీఏస్సీ(బీజడ్‌సీ), బీకాం(సీఏ) గ్రూపులలో ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 4 వరకు దోస్త్ ఆన్‌లైన్‌లో దరఖాస్తులను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. సెప్టెంబర్ 5 నుంచి వెబ్ ఆప్షన్ ఎంచుకోవాలని సూచించారు.

దోస్త్ స్పెషల్ డ్రైవ్

వేములవాడఅర్బన్: దోస్త్ 2023 ద్వారా అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులు కింద స్పెషల్ డ్రైవ్ ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 4 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ అన్నారు. ప్రక్రియ అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లాలోని ఇంటర్మీడియెట్ పూర్తిచేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నియామకం

కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలిగా సుమలత

ముస్తాబాద్: ముస్తాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలిగా చిప్పలపల్లికి చెందిన జంగ సుమలతను నియమిస్తూ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పనిచేస్తామని, తనపై నమ్మకంతో మండల మహిళా బాధ్యతలు అప్పగించిన జిల్లా నాయకత్వానికి సుమలత ధన్యావాదాలు తెలిపారు.

కలుపు మొక్కల నివారణపై అవగాహన

వేములవాడరూరల్: మండలంలోని మల్లారం గ్రామంలో సిరిసిల్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు కలుపుమొక్కలు, వాటివల్ల కలిగే నష్టాలపై రైతులకు వివరించారు. ఏఈవో సందీప్, సర్పంచ్ తిరుపతి, రైతుబంధు కోఆర్డినేటర్ దశరథం, ఎంపీటీసీ తిరుపతి, వ్యవసాయశాఖ కళాశాల డీన్ డా.ఉమామహేశ్వరి, శాస్త్రవేత్త ప్రియదర్శిని, కరీంనగర్ కోఆర్డినేటర్ మదన్‌మోహన్ పాల్గొన్నారు.

చీడపీడలపై ..

గంభీరావుపేట: మండలం కొత్తపల్లి గ్రామంలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల పొలాస విద్యార్థులు సోమవారం రైతులకు చీడపీడలపై అవగాహన కల్పించారు.

జాతీయ అవార్డు గ్రహీత వెంకట్‌రెడ్డికి సన్మానం

ఎల్లారెడ్డిపేట: మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి జాతీయ స్థాయిలో సామాజిక సేవా కార్యకర్త అవార్డును ఢిల్లీలో ఇటీవల అందుకోగా, ఆయనను సోమవారం మండల కేంద్రంలో మహిళ సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

23 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడలు

వీర్నపల్లి: మండల కేంద్రంలో ఈ నెల 23, 24 తేదీల్లో అండర్ 17, 14 ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు మోడల్ స్కూల్ మైదానంలో నిర్వహిస్తునట్లు ఎంఈవో రఘుపతి తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ధర్మసమాజ్ పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి

సిరిసిల్లఅర్బన్: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించే ధర్మ సమాజ్ పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ ప్రచార కమిటీ సభ్యుడు ఎడపెల్లి బాబు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పరమేశ్వరి, ఉల్లెందుల అరుణ్, కట్కూరి బాలరాజ్, కుర్మ సురేశ్, మధు పాల్గొన్నారు.